

ఆధ్యాత్మికతతోనే మనసుకు వికాసం

మామడ, జనవరి 22 : ఆధ్యాత్మికతతోనే మనిషి మనసు వికాసం కలుగుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని దిమ్మదుర్తి తన స్వగ్రామంలో సోమవారం రోజున అయోధ్య రామ మందిరంలోని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా హనుమాన్ ఆలయంలో గ్రామస్థులు నిర్వహించిన ప్రత్యేకపూజా కార్యక్రమంలో భాగంగా ఆయన హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈరోజు ఎంతో పవిత్ర దినమని, అయోధ్య రామ మందిర నిర్మాణమవ్వడం శుభ సూచకమని తెలిపారు.


లండన్‌లో పూజలు చేస్తున్న నిర్మల్ వాసులు
మట్టి బాలరాముని విగ్రహం


ఖానాపూర్.. శ్రీరాంనగర్ కాలనీలో ధ్వజారోహణ


భైంసాలోని రాజీవ్‌నగర్‌లో భారీ శోభాయాత్ర

మార్మోగిన జై శ్రీరామ్

- అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జిల్లా అంతటా పండుగ వాతావరణం
- భారీ స్ర్కీన్‌లలో కార్యక్రమాలను చూసి పులకించిపోయిన భక్తులు
- పలు ఆలయాల్లో ప్రత్యేకపూజలు, హోమాలు, సీతారాముల కల్యాణం
- భారీగా అన్నసంతర్పణ.. ప్రసాద వితరణ
- శ్రీరామ నినాదాలతో శోభాయాత్రలు
- దేవాలయాలకు హారతులతో తరలివచ్చిన మహిళలు

నిర్మల్‌కల్చరల్/ఖానాపూర్/భైంసా/దిలావర్‌పూర్/లక్ష్మణచాంద/సారంగాపూర్, జనవరి 22 : రాముడు పుట్టిన నేల అయోధ్యలో రామ మందిర నిర్మాణం అనే 500 ఏళ్ల నాటి హిందువుల చిరకాల వాంఛ నెర వేరిన వేళ జిల్లాలోని ఊరూ..వాడా అంతా జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిపోయింది. సోమవారం మధ్యాహ్నం అయోధ్యలో జరిగిన బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీవీలలో తిలకించి భక్తులు పులకించి పోయారు. ఆ చారిత్రక ఘట్టాన్ని తిలకించి తరించేందుకు ప్రత్యేక ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఎల్‌ఈడీ స్ర్కీన్‌ల ద్వారా అయోధ్యలో జరుగుతున్న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారాల ద్వారా ప్రజలు వీక్షించారు. ఆలయాలన్నీ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తుతో కిటకిటలాడాయి. రామయ్య విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని రామాలయాలలో, అంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేకపూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం అన్నదానాలను ఏర్పాటు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు సాయంత్రం ఐదు గంటలకు మహిళలు వాకిళ్లలో ముగ్గులు వేసుకుని దీపా లు వెలిగించారు. అనంతరం అయోధ్య పూజిత అక్షింతలను తలపై వేసు కొని ఇంట్లో పెద్దలతో ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ఖానాపూర్‌లో బీజేపీ నేత మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి భూక్యా జాన్సన్‌నాయక్‌తో పాటు పలువురు ప్రముఖులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో కాషాయ ధ్వజారోహణ నిర్వహించారు.

విదేశాల్లో నిర్మల్ వాసుల పూజలు

నిర్మల్ కల్చరల్ : లండన్, స్వీడన్‌లలో నిర్మల్ వాసులు ప్రత్యేకపూజలు చేశారు. సోమవారం అయోధ్యలో రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పూజలు చేసినట్లు భరద్వాజ్, ప్రదీప్, వరుణ్, సాయిక, వినయ్, కేతన్, తదితరులు తెలియజేశారు.

బాలరాముని మూలవిరాట్ విగ్రహం తయారీ

అయోధ్యలో రూపుదిద్దుకున్న బాలరాముని విగ్రహాన్ని పోలిన మట్టి విగ్రహాన్ని నిర్మల్ కళాకారుడు పోలీసు భీమేష్ తయారు చేసి తన భక్తిని చాటుకున్నాడు.

ఎమ్మెల్యే ఏలేటి పూజలు

నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చిట్యాల, మంజులాపూర్, కొండాపూర్‌లలో హనుమాన్ ఆలయాలను సందర్శించి ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. భైంసాలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పలు ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లాలో నిర్మల్, భైంసాతో పాటు ప్రధాన కూడళ్లు, పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేకచర్యలు తీసుకున్నారు. ఆలయాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉత్సవ్ వేడుకలను స్థానిక విజయ్ హైస్కూల్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. సీతారాముల చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. చిన్నారుల సీతారామ, లక్ష్మణ, హనుమాన్ వేషధారణ ఆహూతులను ఆకట్టుకుంది.

భాగ్యనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. అయోధ్యలో రామ మందిర ప్రారంభం, రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదర్శనగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఛైర్మన్ ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పట్టణంలోని బ్రహ్మపురి, రామ మందిర్, సోమవార్‌పేట్, ఖిల్లా గుట్ట, చింతకుంట, బంగల్‌పేట్ వాడల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో సోమవారం పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు జరిపి జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. అయోధ్యలో రాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ, ఆలయ ప్రారంభం పురస్కరించుకొని మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో హాజరయ్యారు. శ్రీరాముని చిత్రపటానికి పూలమాల వేశారు. ఆయా ప్రాంత కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు. నాయుడి వాడలో పలు జంటలు హోమాన్ని నిర్వహించాయి. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సాధం అరవింద్, కౌన్సిలర్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి, పీచర గ్రామాల్లోని రామాలయాలతో పాటు ఆయా గ్రామాల్లో వేడుకలు సోమవారం భక్తి పూర్వకంగా కొనసాగాయి.నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలో ప్రత్యేకంగా ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేకపూజలు చేశారు.

సారంగాపూర్ మండలంలోని జాంగ్రామంలో గల లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీవీలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వీక్షించి ఆలయంలో మొక్కులను మొక్కి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

కరసేవకులకు సన్మానం

అయోధ్య కరసేవలో పాల్గొన్న కరసేవకులకు సోమవారం వశిష్ఠ కళాశాలలో ఘనంగా సన్మానించారు. అయ్యన్నగారి భూమయ్య, మంచిర్యాల నాగభూషణం, తోట పాపేష్, జిల్లా అశోక్, ఒడిసెల శ్రీనివాస్, అఖిలేష్ సింగ్, రవీందర్ పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ రామాలయంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. నాడు కరసేవలో పాల్గొన్న గ్రామానికి చెందిన భోజరాం పటేల్, రాజేందర్‌రెడ్డి, గంగాధర్ పటేల్, సత్తి పిరాజిలకు ఎమ్మెల్యే సన్మానం చేశారు.

జగదాభిరామునికి భైంసా వాసులు నీరాజనాలు పలికారు. సోమవారం వేకువ జాము నుంచే ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలో పూజ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆయా కాలనీవాసులు తమ తమ కాలనీల పరిధిలో శోభయాత్ర, నగర సంకీర్తనలు చేపట్టారు. ఆలయాల్లో జరిగిన వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రామనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. అయోధ్యలో జరిగిన కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు గాను పలు ఆలయాల్లో ఎల్‌ఈడీ, డీజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేషధారణలు అలరించాయి. పలు ఆలయాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు వన్నె తెచ్చాయి. చివరగా అన్ని ఆలయాల్లో భారీ అన్నదాన కార్యక్రమాలు జోరుగా కొనసాగాయి. భైంసా పట్టణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని
సందర్శించిన ఎమ్మెల్యే ఏలేటి


ఎమ్మెల్యేకు వ్యవసాయ క్షేత్రం గురించి వివరాలు వివరిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, జనవరి 22 : నిర్మల్ మండలం కొండాపూర్ సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి సమీకృత వ్యవసాయ క్షేత్రం గురించి వివరాలు ఎమ్మెల్యేకు వివరించారు.

శ్రీ కేతేశ్వర కంకాలమ్మ జాతర కరపత్రాల విడుదల


కేతేశ్వర కంకాలమ్మ జాతర కరపత్రాలను విడుదల చేస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్, జనవరి 22 : మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని వీర్ల గుట్ట రాక్ టెంపుల్‌లోని శ్రీ కేతేశ్వర కంకాలమ్మ శివాలయం జాతర కరపత్రాలను సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 28వ తేదీన జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బృందం తెలిపింది. ఈ జాతరకు నియోజకర్గ నలుమూలల నుండి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ బృందం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో పాటు నిర్వాహకులు కవ్వాల్ నర్సయ్య, తదితరులున్నారు.

తిరుపెల్లిలో కొమురం భీం విగ్రహ ఆవిష్కరణ


తిరుపెల్లిలో కొమురం భీం విగ్రహ ఆవిష్కరణ చేసిన దృశ్యం

లక్ష్మణచాంద, జనవరి 22 : మండలంలోని తిరుపెల్లిలో ఆదివాసి ముద్దుబిడ్డ, అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడి అమరుడైన మాన్యశ్రీ కొమురం భీం విగ్రహ ఆవిష్కరణను సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, తిరుపెల్లి గ్రామ సర్పంచ్ కొరిపెల్లి కృష్ణారెడ్డి ఇచ్చిన రూ. 1 లక్ష విరాళంతో ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగన్న, గ్రామస్థులు మోహన్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, బొమ్మెన రవి, తదితరులు ఉన్నారు.

క్రికెట్ విజేత దస్తూరాబాద్ జట్టు

పెంబి, జనవరి 22 : మండల కేంద్రంలో పెండల సురేష్ స్మారక క్రికెట్ పోటీలు గత పది రోజుల నుండి నిర్వహించగా ఇందులో 47 జట్లు పాల్గొనగా సోమవారం ఫైనల్‌లో పెంబి, దస్తూరాబాద్ పోటీ పడగ విజేతగా దస్తూరాబాద్, రన్నరప్‌గా పెంబి జట్లు గెలుపొందాయి. జట్లకు మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండవ బహుమతి రూ. 10 వేలను నిర్వాహకులు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. పెంబి ఎస్‌బీఐ వారు కూడా గెలిచిన జట్లకు ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, ఉప సర్పంచ్ స్వప్నిల్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎస్‌బీఐ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జనవరి 22 : జిల్లాలో ఇంటర్మీడియట్‌పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం ఇంటర్ ప్రాక్టికల్, వార్షిక పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి 1 నుండి 15 వరకు ప్రథమ, ద్వితీయ పరీక్షలు జరుగుతాయన్నారు. వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 28 నుండి ప్రథమ, 29 నుండి ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నిర్వహిస్తారన్నారు. జిల్లాలోని 38 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్, త్రాగునీరు, ఫర్నిచర్, తదితర సౌకర్యాలు విద్యార్థులకు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరేలా బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశాలిచ్చారు. ఇంటర్మీడియట్ అధికారి పరుశరాం, తదితర అధికారులు పాల్గొన్నారు.


ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజల నుంచి ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీ లించి పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజల నుండి 14 దరఖా స్తులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు ప్రజావాణిలో పాల్గొన్నారు.

జిల్లా అంతటా భారీ పోలీసు బందోబస్తు


భైంసాలోని కమాండ్ కంట్రోల్‌గదిలో పరిశీలన చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల


భైంసాలోని జుల్పేకర్ కాలనీలో పోలీసుల బందోబస్తు

భైంసా, జనవరి 22 : అయోధ్య నగరిలో సోమవారం జరిగిన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా అంతటా పోలీసులు భారీ బందోబస్తున్న ఏర్పాటు చేశారు. వివాస్పద ప్రాంతమైన భైంసాలో నిర్వహించిన వేడుకలకు పోలీసుశాఖ భారీ బందోబస్తు చర్యల చేపట్టింది.సమస్యాత్మక,మతకల్లోలిత ప్రాంతంగా ముద్రపడ్డ భైంసాలో కొనసాగే వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయకుండా ఉండేందుకు గాను పోలీసు శాఖ ముందస్తు కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టింది. సమస్యాత్మక, వివాదాస్పద ప్రాంతాలతో పాటు ఆలయాలు, ప్రార్థన స్థలాలు, వేడుకలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల్, అడిషనల్ ఏస్పీ (ఎఆర్) వెంకటేశ్వర్ సోమవారం భైంసాలో పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు. పట్టణ పోలీసు స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల ద్వారా వేడుకల నిర్వాహణ, పోలీసు బందోబస్తును ఎస్పీ పరిశీలించారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ నేతృత్వంలో టౌన్ సీఐ రాజారెడ్డి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఇద్దరు అడిషనల్ ఏస్పీలు, ఒక డీఎస్పీ, 6గురు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, 14 మంది ఎస్ఐలు, 217 మంది పోలీసు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టెబుళ్లతో పాటు ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తులో పాల్గొన్నాయి. పట్టణంలోని 26 వార్డులను 10 సెక్టార్లుగా విభజించి భద్రతా చర్యలు చేపట్టారు. సమస్యాత్మక, వివాదస్పద ప్రాంతాల్లో 45 పైగా పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

నిర్మల్ కల్చరల్, జనవరి 22 : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఎస్పీ జానకి షర్మిల ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులు చేసేందుకు వచ్చే బాధితులతో పోలీసులు ఆప్యాయంగా పలుకరించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీలుగా వ్యవహరించాలన్నారు. ప్రజలు సంఘ వ్యతిరేక, అపరిచిత, అనుమానాస్పద వ్యక్తుల సమచారం పోలీసులకు తెలియజేసి సహకరించాలన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లతో పాటు జిల్లా పోలీసుశాఖ వాట్సాప్ నెంబర్ 8712659599కు తెలియజేయాలని కోరారు.


ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ షర్మిల

అధికారులు ఫుల్.. దరఖాస్తులు నిల్


భైంసాలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

భైంసా, జనవరి 22 : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల విభాగానికి భైంసాలో స్పందన కానరావడం లేదు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ కోసం గాను ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతోంది. అయితే సంబంధిత కార్యక్రమానికి అధికారులు అధికసంఖ్యలో హాజరవుతున్నప్పటికీ దరఖాస్తు చేసుకునే వారు కరువవుతున్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగానికి తహసీల్దార్, ఎంపీడీవోతో పాటు వివిధ శాఖలకు చెందిన 14 మంది అధికారులు హజరయ్యారు. అయితే ఒక్కరు కూడా సంబంధిత విభాగంలో దరఖాస్తు చేసుకునేందుకు రాలేదు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తదుపరి ఇప్పటి వరకు ఐదు పర్యాయాలు ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహించినప్పటికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదని అధికారులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఏఎంఆర్ టవర్స్‌లో
హనుమాన్ చాలీసా పఠనం


శ్రీరామ ఆకృతిలో దీపాలను వెలిగించిన దృశ్యం

నిర్మల్ అర్బన్, జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని పట్టణంలోని ఏఎన్ రెడ్డి కాలనీలో గల ఏఎంఆర్ టవర్స్‌లో మహిళలు ప్రత్యేకపూజలు చేశారు. శ్రీరామ ఆకృతిలో దీపాలను వెలిగించి హనుమాన్ చాలీసాను పఠించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని జైశ్రీరామ్ నినాదాలు చేశారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ


పగల గొట్టిన హుండీనిచూపుతున్న ఆలయ కమిటీ నాయకులు

కుభీర్, జనవరి 22 : మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరి జరిగినట్లు ఆలయకమిటీ నాయకులు తెలిపారు. రోజు మాదిరిగానే ఆదివారం సాయంత్రం పూజలు చేసి ఆలయానికి తాళం వేసి వెల్లారు. కాగా రాత్రి 1గంటల సమయంలో గుర్తుతెలియని దుండగుల తాలం పగకొట్టి రేణుక మాత మెడలోని 10గ్రాముల బంగారు ఆభరణాలు,మెట్టెలు రెండు హుండీల్లోని దాదాపు 12 నుంచి 20 వేల రూపాయల నగదును చోరి చేసినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై ఎండీ షరీఫ్, సంఘటన స్థలానికిచేరుకుని పరిశీలించి వేలి ముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పల్సికర్ రంగారావు ప్రాజెక్టులో పడి
ఒకరి ఆత్మహత్య


సాయినాథ్ మృతదేహం


భైంసా రూరల్, జనవరి 22 : మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన పసుపుల సాయినాథ్ గుండెగాం సమీపంలో ఉన్న పల్సికర్ రంగారావు ప్రాజెక్టులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన కథనం ప్రకారం... మహాగాం గ్రామానికి చెందిన పసుపుల సాయినాథ్(24) గత కొద్ది రోజుల నుంచి చర్మవ్యాధితో బాధపడుతుండడం వల్ల జీవితంపై విరక్తి చెందిన ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరి ప్రాజెక్టులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.




యువత సామాజికసేవలో ముందుండాలి

● జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి

తలమడుగు, జనవరి 22: యువత సామాజికసేవలో ముందుండాలని తలమడుగు జడ్పీటీసీ గణేష్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గల యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాలను సద్వినియోగ పరుచుకోవాలన్నారు. అనంతరం మాలసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. రుయ్యాడి నూతన మాల సంక్షేమ సంఘం ఎన్నికైన సభ్యులు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని తిరిగి సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ యువకులకు చోటు కల్పించడం అభినందనీయమని తెలిపారు. కష్టపడి పని చేసి కుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. తనవంతు సాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నూతన అధ్యక్షుడు ఉడుగు అఖిలేష్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు మహేందర్, కోశాధికారి నక్కవేణు, కార్యదర్శులు రాకేష్, కిరణ్ సంఘ నాయకులు బిట్లచైతన్య, లస్మన్న, చిన్న గంగన్న, రావుల గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

















అటకెక్కిన గిరిజన సంక్షేమం

- ● గిరిజన సంక్షేమానికి నిధులు కేటాయించాలి
- ● సమయం ప్రకారం పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలి
- ● అప్పుల ఊబిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు
- ● నేడు రాష్ట్ర మంత్రి సీతక్క సమీక్ష

ఉట్నూర్, జనవరి 22: ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమం ఏర్పాటు చేసిన సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)కు సక్రమంగా నిధుల కేటాయింపు జరుగక పోతుండడంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు దశాబ్ద కాలంగా అంతంత మాత్రం అయ్యాయని గినిజనులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యక్రమాలతో పాటు ఉమ్మడిజిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించడానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క వస్తుండడంతో జిల్లాలోని గిరిజనుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడానికి ఈ ప్రయత్నం. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమం భాగా జరుగుతుందని అందరు భావించినప్పటికీ గత ప్రభుత్వ కాలంలో అనుకున్నంత నిధులు రాక సంక్షేమ పథకాలు నత్తనడకన నడిచాయని గిరిజనులు అంటున్నారు. గిరిజనుల విద్యాభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఉన్న ఏజెన్సీ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ఎత్తి వేయడంతో ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఏకోపాధ్యా పాఠశాలలపై పర్యవేక్షణ లేక విద్య వ్యవస్థ కుంటు పడిందని గిరిజన సంఘాలు విమర్శిస్తున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కార్యక్రమాలను గతంలో ఏజెన్సీ డీఈవో సమీక్షిస్తూ ఉండేవారు. ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుతో జిల్లాకు ఒక డీఈవో కార్యాలయం ఉండగా ఐటీడీఏలో ప్రత్యేక డీఈవో అవసరం లేదని భావించి కార్యాలయాన్ని ఎత్తి వేయడంతో విద్యా వ్యవస్థ అయోమయంలో పడింది. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలపై పర్యవేక్ష లేక పోవడంతో పాధ్యాయుల పరిస్థితి ఆడింది పాట పాడింది పాట అన్న చందంగా మారిందని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని గిరిజన సంఘాలు అంటున్నాయి. ఏజెన్సీ విద్యాశాఖ కార్యాలయాన్ని ఐటీడీఏలో పునరుద్ధరించి విద్యారంగం అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని పరిశీలకులు అంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్న తరహా నీటి పారుదల శాఖ కార్యాలయాన్ని కూడా గత ప్రభుత్వం ఎత్తివేసింది. ఫలితంగా ప్రాంతాలలో వాగులలో పోతున్న నీటిని సద్వినియోగం చేసుకోవడానికి ఎలాంటి ప్రణాళికలు అమలు కావడం లేదు. గతంలో ఇరిగేషన్ అధికారులు ఉండడంతో ఊట కుంటలు, చెరువులు, చెక్‌డ్యాములు, ఎత్తిపోతల పథకాలు నిర్మించడం ద్వారా గిరిజనులకు సాగునీరు అందుబాటులోకి తెచ్చేవారు. కాని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నగిరి వికాసం కార్యక్రమాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పగించడంతో ఐటీడీఏఅధికారులుకేవలం సమన్వయం చేసే పనుల్లో ఉండిపోతున్నారు. గిరి వికాసం పథఖం అమలు చేసిన నాటి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగ 14907 మంది గిరిజనులు గిరి వికాసం పథకం ద్వారా తమ వ్యవసాయ భూముల్లో బోరు, మోటారు, కరెంట్ అందించాలని దరఖాస్తులు చేసుకోగా కేవలం 3692 మంది గిరిజనులకు మాత్రమే ప్రయోజనం కలిగించడానికి అధికారులు కృషి చేస్తూ ఉండడంతో మిగత గిరిజనులు నిరాశకు గురవుతున్నారు. గిరి వికాసం పథకం అమలు కోసం కావాల్సిన నిధులను ప్రభుత్వం కేటాయించక పోవడంతో పథకం ముందుకు వెళ్లలేదని సంబంధిత అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం

● వార్డెన్లకు తప్పని తిప్పలు

ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న వార్డెన్లు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి నేటి వరకు విద్యార్థుల ఆహార అవసరాల కోసం నిధుల కేటాయింపు సక్రమంగా చేయక పోవడంతో డిప్యూటీ వార్డెన్లు కిరాణ దుకాణాలలో అప్పులు చేసి పిల్లలకు భోజనం పెట్టిస్తున్నారు. గతంలో సహకార సంస్థద్వారా ఆశ్రమ పాఠశాలలకు కావాల్సిన నిత్యావసర సరుకులను టెండర్ ద్వారా వ్యాపారులను పిలిచి జీసీసీ అధికారులు పాఠశాలలకు సరుకులు సరఫరా చేసేవారు. గిరిజనసంక్షేమ శాఖ అధికారులకు ప్రభుత్వం నుంచి నిధులు రాక పోవడంతో జీసీసీ అధికారులకు సుమారు 14కోట్ల రూపాయల అప్పు పేరుకు పోయింది. ఫలితంగా జీసీసీ అధికారులు ఆశ్రమ పాశాలలకు సరుకులుసరఫరా నిలిపి వేయగా, వ్యాపారులు సైతం టెండర్లలో భాగస్వామ్యం కావడం లేదు. ఫలితంగా అధికారులు డిప్యూటీ వార్డెన్‌లో అందుబాటులో ఉన్న దుకాణాల నుంచి కొనుగోలు చేసుకోవాలని ఆదేశించడంతో డిప్యూటీ వార్డెన్లు సైతం లక్షలాది రూపాయల అప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదేకాకుండా గిరిజన సంక్షేమ శాఖలో, ఐటీడీఏలో పని చేస్తున్న దినసరి ఉద్యోగులకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాల బడ్జెట్ కేటాయింపుల్లో కూడాజాప్యంజరుగుతుండడంతో దినసరి ఉద్యోగులు వేతనాల కోసం వేతలు పడుతున్నారు.

● ఆరేళ్లుగా జరగని పాలకవర్గ సమావేశం

అక్టోబరు 2018లో జరిగిన ఐటీడీఏ పాలక వర్గ సమావేశం తిరిగి ఏర్పాటు చేయడంలో ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. ప్రతీ నాలుగు మాసాలకు ఒకసారి ఐటీడీఏ పాలక వర్గ సమావేశం ఏర్పాటు చేసి గిరిజన ప్రాంతాలలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను జిల్లాలోని శాసన సభ్యులు ఎంపీలు, మంత్రులు హాజరై సమీక్షించాల్సి ఉంటుంది. కానీ గత ప్రభుత్వం పాలకవర్గ సమావేశాలు ఏర్పాటు చేయడంలో విఫలమైంది. ఆ రోజుల్లో ఉన్న జిల్లా మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు సమయం చిక్కక పోవడంతో ఐటీడీఏ పాలక వర్గ సమావేశాన్ని పూర్తిగా విస్మరించారు.ఇప్పటికైనా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు మంత్రులు జిల్లాలోని గిరిజనుల సంక్షేమం అభివృద్ధి కోసం ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలు ఏర్పాటు చేసుకుని అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని గిరిజనులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఐటీడీఏ ప్రారంభంలో సెక్టోరియల్ వ్యవస్థ ఉన్నట్లుగా తిరిగి ఈ వ్యవస్థను పునరుద్ధరించడం ద్వారా కూడా ప్రయోజనాలు ఉంటాయని గిరిజనులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఐటీడీఏలో ఎత్తివేసిన కార్యాలయాలను తిరిగి రప్పించి గిరిజన అభివృద్ధికి కృషి చేయాలని గిరిజనులు భావిస్తున్నారు.



రిమ్స్ వైద్యురాలికి జాతీయ స్థాయి అవార్డు



మేజర్ కారుణ్య

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 22: మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈనెల 18 నుంచి 20 వరకు నిర్వహించిన 45వ జాతీయ స్థాయి ఫారెన్సిక్ మెడికల్ సదస్సుకు డాక్టర్ బి.కర్నాకర్, డాక్టర్ అంకితరావు, డాక్టర్ కారుణ్యవైద్యుల బృందం హాజరయ్యారు. ఇందులో రిమ్స్ వైద్యురాలు మేజర్ కారుణ్య (ఫస్ట్ ఇయర్ పీజీ) జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించారు. మనిషి హత్యకు గురైన సమయంలో మెడ కోసి చంపిన కేసులో రక్తం గొంతులోకి పోయి మరణించడాన్ని గుర్తించినందుకు ఈ అవార్డు లభించినట్లు రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ తెలిపారు. జాతీయ స్థాయిలో రిమ్స్ వైద్యులు ప్రతిభ కనబరిచినందుకు వారిని అభినందించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

ఉట్నూర్, జనవరి 22: మండల కేంద్రంలో చెందిన దాతుర్కా రామకృష్ణ(42) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత రెండు రోజుల క్రితం అదృష్యమైన రామకృష్ణ ఆచూకీ లభించడం లేదని మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. సోమవారం గంగన్నపేట చెరువులో మృతదేహం కనిపించడంతో పోస్టుమార్టంకు తరలించి ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించారు.



శ్రీరామ చిత్రపటానికి అక్షింతలు సమర్పిస్తున్న మెస్రం వంశీయులు



కలశానికి పూజలు చేస్తున్న ఆదివాసీ మహిళలు

కేస్లాగూడలో కలశానికి ఆదివాసీల పూజలు

ఇంద్రవెల్లి, జనవరి 22: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగా గుర్తింపు పొందిన ఏటా పుష్యమాసం అమవాస్యను పురస్కరించుకొని మెస్రం వంశీయుల నిర్వహించే కేస్లాపూర్ నాగోబా దేవత మహాపూజలకు అవసరమగు గంగాజలం కోసం ఆదివారం సాయంత్రం కేస్లాపూర్ నుంచి బయలుదేరిన మెస్రం వంశీయులు కేస్లాగూడ గ్రామ పొలిమేరలో బస చేశారు. ఈ సందర్భంగా కేస్లాగూడ గ్రామస్తులు మెస్రం వంశీయులకు ఘన స్వాగతం పలికారు. సోమవారం ఉదయం కేస్లాగూడ గ్రామస్తులు ఝరి (కలశం) దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయోధ్యలో శ్రీరామ ప్రతిష్ట సందర్భంగా శ్రీరామ చిత్రపటానికి అభిషేకం చేసి అక్షింతల సమర్పించారు. మెస్రం వంశీయులకు గ్రామస్తుల ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం మెస్రం వంశీయులు కేస్లాగూడ నుంచి మండల కేంద్రం మీదిగా ఉట్నూర్ మండలంలోని సాకర గ్రామానికి కాలినడకన వెళ్లారు. మెస్రం వంశీయులు కటోడ మెస్రం కోసు, కటోడ, మెస్రం కోసేరావు, ప్రధాన్ మెస్రం దాదారావు, మెస్రం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి మీదిగా బయలుదేరిన మెస్రంలు

ఊరూరా బాలరాముడి ప్రాణప్రతిష్ఠ పండుగ



కనుగుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



సోనాల రామాలయంలో ప్రధాని ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎంపీ సోయం

● అంతటా ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

బోథ్, జనవరి 22: అయోధ్య లో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ జరగడంతో మండలంలో గ్రామ గ్రామాన పండుగ వేడుకలను జరుపుకున్నారు. మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో పాత హనుమాన్ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుచిలాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీరాముని కళ్యాణాన్ని నిర్వహించారు. పోచ్చెర గ్రామంలో రామాలయంలో ప్రత్యేక పూజలు గావించారు. కనుగుట్ట గ్రామంలో గ్రామస్థులంతా కలిసి శ్రీరామునికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో శబరిమాతాలయం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపి ఊరేగింపు నిర్వహించారు. గ్రామ గ్రామీణ రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులుఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలో శ్రీరాముడికి ప్రత్యేకపూజలు చేపట్టారు. కూచిలాపూర్ ఆలయంలో కస్తూరి రమేష్ వేంకటేశ్వరుడి కళ్యాణం నిర్వహించి అన్నదానం చేశారు.

● ప్రధాని ప్రసంగాన్ని వీక్షించిన ఎంపీ

బోథ్ మండలంలోని సోనాల, బోథ్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీ సోయం బాబూరావు పాల్గొన్నారు. దీనిలో భాగంగా శ్రీరాముడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రధానమంత్రి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చూశారు. అనంతరం బోథ్ మండల కేంద్రంలోని దుర్గా కమిటీలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లో ప్రధానమంత్రి ప్రసంగాన్ని ఎంపీ వీక్షించారు. ఆయన వెంట దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జీవి రమణ భారతీయుల జనతా పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుటు జి. రాజుయాదవ్, అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు మాధవరావు మండల పార్టీ కన్వీనర్ సుభాష్, సుర్యతో పాటు దుర్గా కమిటీ సభ్యులు సోనాల ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ అట్టలతో రామ మందిర నిర్మాణం

తాంసి, జనవరి 22:మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన కార్నివర్ స్వామి, ప్రవీణ్ అనే ఇద్దరు వ్యక్తులు పేపర్ అట్టలతో అయోధ్య రామాలయం నమూనా మందిరాన్ని తయారు చేశారు. తయారు చేసిన ఈ నమూన మందిరాన్ని సోమవారం మధ్యాహ్నం గ్రామంలో రామాలయంలో ప్రతిష్ఠించారు. అచ్చం అయోధ్యలో నిర్మించిన రామ మందిరం మాదిరిగా తయారు చేసిన ఈ మందిరాన్ని పలువురు ఎంతో ఆసక్తిగా చూసేందుకు బారులు తీరారు. తయారు చేసిన ఇద్దరు వ్యక్తులను పలువురు అభినందిస్తున్నారు. కేవలం 4గంటల్లో దీన్ని తయారు చేసినట్లు వారు పేర్కొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాల విద్యార్థులు అయోధ్యలోని రామ మందిరం నమూనాను తయారు చేశారు. తయారు చేసిన నమూనా భవనాన్ని మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. విద్యార్థులు శ్రీనివాస్, నితిన్, గుణ చరణ్, అరవింద్, శివరాజ్, జస్వంత్ రాహుల్ తయారు చేశారు. ఈ సందర్భంగా ఆలయం పట్టణ వాసులను ఆకట్టుకుంది.



అయోధ్య భవ్య మందిరాన్ని పరిశీలిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వడ్డాడిలో భజన పోటీలు

తాంసి, జనవరి 22: మండలంలోని వడ్డాడి గ్రామంలో గత మూడు రోజుల నుంచి భజన పోటీలు ప్రారంభించారు. బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం సాయంత్రం వరకు జిల్లా నలుమూలల నుంచి పలు భజన బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. చెవులకు ఇంపగలిగే పాటలు పాడుతూ భజన కళాకారులు అందరినీ ఆకట్టుకున్నారు. మరో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. భజన పోటీలు తిలకించేందు కోసం పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం హాజరవుతున్నారు. నిర్వాహకులు భోజన వసతిని ఏర్పాటు చేశారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బోథ్, జనవరి 22: మండలంలోని పొచ్చెర గ్రామంలో సోమవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.మల్లేష్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు షైపాల్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమావేశం

బోథ్, జనవరి 22: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 2024-25 సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రనాళికపై ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశంలో రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. చేపట్టే పనులను ప్రతిపాదనలు చేయడం జరిగింది. సమావేశంలో ఎంపీడీవో సుశీల, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

బోథ్, జనవరి 22: మండల కేంద్రంలోని పోచమ్మ గల్లీలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సర్పంచ్ సురేందర్ యాదవ్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ ఆధ్వర్యంలో అరుణకు గుడ్లు అందించారు.

ఢిల్లీ పరేడ్ గ్రౌండ్‌కు జిల్లా విద్యార్థులు

ఉట్నూర్, జనవరి 22: దేశ రాజధానిలో ఈనెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జాతర్ల ఆదర్శ క్రీడ పాఠశాల, ఉట్నూర్‌లోని ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థులు సతీష్ మోతిరాం నరేష్, పరశురాం, అర్జున్, శ్రీకాంత్, సోము అనే విద్యార్థులు ఎంపికయ్యారని, వీరిని ఢిల్లీకి పంపిస్తున్నామని, వీరందరూ ఢిల్లీ పరేడ్‌లో పాల్గొంటారని జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ఫిజికల్ డైరెక్టర్ జాదవ్‌హేమంత్‌నాయక్‌లు పేర్కొన్నారు.

అంతా.. రామమయం


● ఆదిలాబాద్‌లో మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

- జిల్లాలో అంబరాన్నంటిన అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సంబురాలు
- రాములోరి మహోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించిన ప్రజలు
- పులకించి తరించిన భక్తజనం
- జిల్లాలోని రామాంజనేయ ఆలయాలలో ప్రత్యేక పూజలు
- పల్లకీ ఊరేగింపులు.. భజనలు.. అన్నదాన కార్యక్రమాలు
- భక్తులతో కిటకిటలాడిన ప్రధాన ఆలయాలు
- రామనామ స్మరణ.. జైశ్రీరాం నినాదాలతో మార్మోగిన పల్లెలు, పట్టణాలు
- అంతటా సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ


● ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న భక్తులు
● ఆదిలాబాద్‌లో భారీ శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎస్పీ

ఆదిలాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ కనిపించింది. ఊరువాడా అంతా రామమయంగా మారింది. ఎవరి నోట విన్న అయోధ్య మాటనే వినిపించింది. రామనామస్మరణతో జైశ్రీరాం.. అంటూ భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. జిల్లాలోని ప్రధాన ఆలయాలైనా సీసీఐలోని అతి పురాతన రామాలయం, పాత హౌజింగ్ బోర్డులోని రామాలయం, తిర్పెల్లి రామాలయం, బోథ్ మండలం సోనాల రామాలయం, తలమడుగు మండలంలోని కజ్జర్ల, సుంకిడి, బరంపూర్, తాంసి మండలంలోని బండల్ నాగాపూర్, జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ, వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రామాంజనేయ ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి పూజ లు నిర్వహించారు. సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ స్టేటస్‌ల్లోనూ బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన పోస్టులే కనిపించాయి. బోథ్ మండలం సోనాల రామాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ సోయం బాపురావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని భుక్తాపూర్ రామాంజనేయ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. అలాగే గోపాలకృష్ణ మఠంలో నిర్వహించిన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాయల శంకర్, ఎస్పీ గౌస్‌ఆలంలు హాజరయ్యారు. పలు గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లో వీడీసీ కమిటీలు, వార్డు కమిటీలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటుచూసినా రామనామ స్మరణతో పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పట్టణ ప్రధానవీధుల గుండా రాత్రి భారీ శోభాయాత్రను నిర్వహించారు.


● బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ



రాములోరి సంబురం

పల్లె, పట్టణ వాసులంతా రాములోరి సంబురాలను జరుపుకున్నారు. ఉదయం ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేసి పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. పలు గ్రామాల్లో డప్పు, భజంత్రీలు, మంగళహారతులతో రాముడి పల్లకీ ఊరేగింపులు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో డీజేలతో శోభాయాత్రలో యువకులు, మహిళలు నృత్యాలు చేశారు. కోలాహలంగా పల్లకీ ఊరేగింపును చేపట్టారు. వీడీసీ, వార్డు కమిటీల తరపున రామాంజనేయ ఆలయాల వద్ద ప్రత్యేక అన్నదాన కార్యక్రమాల ను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల భజన కార్యక్రమాలను నిర్వహించారు.

రామ భక్తుల ఆనందం

అయోధ్యలో జరిగే బాల రాముని ప్రాణప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. ఆలయాల ప్రాంగణాల్లో భారీ ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేసి బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ కార్యక్రమానికి పెద్దమొత్తం లో మహిళలు, యువకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సంస్కృతిక భజన కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని చూసేందుకు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూశారు. ప్రత్యక్ష ప్రసారాల్లో అయోధ్య ఆలయ ప్రారంభోత్సవ ఘట్టాన్ని చూసేందుకు జనలందరు టీవీలకే అతుక్కుపోయారు. ఎన్నో ఏళ్ల కల నేటితో నెరవేరిందని రామభక్తులు ఆనందం వ్యక్తం చేశారు.


సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ల మధ్య శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు

రాముడి విగ్రహంతో భారీ శోభాయాత్ర

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 22: అయోధ్యలో శ్రీబాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా శ్రీరామనవి ఉత్సవ సమితి అధ్యక్షుడు రాళ్లబండి మహేందర్ ఆధ్వర్యంలో పట్టణంలో శ్రీరాము డి విగ్రహంతో భారీ శోభయాత్ర నిర్వహించారు. యాత్రను శ్రీగోపాలకృష్ణ మఠం నుంచి ఎంపీ సోయం బాపురావు, ఎస్పీ గౌస్‌ఆలం, ఎమ్మెల్యే పాయల శంకర్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్‌బాబులు ప్రారంభించారు.

● బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

తెలంగాణ పోలీసు మొబైల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పట్టణంలో జరుగుతున్న రామ ర్యాలీని, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ గౌస్‌ఆలం ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం సిబ్బంది పలు సూచనలు చేశారు.

సంక్షిప్త సమాచారం


బాధ్యతలను స్వీకరించిన ఖుష్బుగుప్తా

ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా ఖుష్బుగుప్తా బాధ్యతల స్వీకరణ

ఉట్నూర్, జనవరి 22: ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న ప్రాజెక్టు అధికారి చాహత్‌బాజ్‌పాయి మెటర్నటీ సెలవుపై వెళ్లడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇన్‌చార్జి పీవోగా ఖుష్బుగుప్తాను నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం ఇన్‌చార్జి పీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇందులో ఏపీవో జనరల్ భీంరావు, పీవీటీజీ ఏపీ భాస్కర్, పరిపాలనా ధికారి రాంబాబు, జేడీఎం నాగభూషణం, తదితరులున్నారు.

25న పట్టణంలో బైక్ ర్యాలీ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 22: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 25న ఉదయం 10గంటలకు జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణం నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు యువజన క్రీడల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడా పోషకులు, క్రీడా ప్రేమికులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు జిల్లా బంద్ : కాశవేణి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 22: ఆర్మూర్ రైల్వే లైన్ సాధన కోసం చేస్తున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని సాధన కమిటీ అధ్యక్షుడు కాశవేణి నారాయణయాదవ్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిని విలేకరుల సమావేశంలో సాధన కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. ఉద్యమంలో భాగంగా ఈ నెల 24న జిల్లా బంద్ పాటించాలని అఖిల పక్ష సమావేశంలో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బందులో పాల్గొనడానికి విద్యా సంస్థలు వాణిజ్య వ్యాపారులు స్వచ్ఛందంగా జిల్లా బందు పాటించడానికి ముందుకు వచ్చారని తెలిపారు. ఇందులో ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్, వైస్ చైర్మన్ దత్తాత్రి, సభ్యులు సిర్రదేవేందర్, అఫ్సర్ ఖాన్, దేవిదాస్ తదితరులుపాల్గొన్నారు.

'అంకిత భావంతో పనిచేయాలి'

ఉట్నూర్, జనవరి 22: ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసినప్పుడేసమాజంలో వారి విలువ మరింత పెరుగుతుందని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తూ మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జాదవ్ వెంకట్‌రావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భుక్యరాజేశ్‌నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన అయోధ్య సంబురాలు

ఉట్నూర్, జనవరి 22: అయోధ్య రామ మందిరంలో బాల రాముడు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఉట్నూర్ ఏజెన్సీలోని గ్రామగ్రామాన ఆలయాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉట్నూర్ పట్టణంలోని హనుమాన్ మందిరం నుంచి విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నగర సంకీర్తన శోభయాత్రలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీపీ పంద్ర జైవంత్‌రావుతో పాటు మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువకులు రామ మందిరం భక్తి పాటలపై నృత్యాలు చేశారు. బాల రాముడి విగ్రహాన్ని పల్లకిలో పెట్టి ఊరేగిస్తూ ఉట్నూర్ మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో ఉన్న కాకతీయుల ఎలుబడిలో నిర్మించిన శ్రీసీతారాముల ఆలయం వరకు పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట పూజారి సంతోష్‌దుబేఆధ్వర్యంలో శ్రీసీతారాముల హావన యజ్ఞం ఘనంగా నిర్వహించారు. భక్తులు హావన యజ్ఞంలో పాల్గొని తరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఎస్సై మనోహార్‌ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణకు హాజరై ప్రజలందరు ప్రసాదాన్ని స్వీకరించారు.

అలాగే, ఉట్నూర్ మండల కేంద్రంలోని రామాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు.

నేరడిగొండ: అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ బాల రాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని బుగ్గారాం నేరడిగొండ, వడూర్, వాంకిడి, తేజాపూర్, కుమారి, కోర్టికల్, బుద్దికొండ, కుంటాల తదితరగ్రామాలలో గల రామాంజనేయ ఆలయాలలో రాములోరికి ప్రత్యేక పూజలుచేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు చల్లుకున్నారు. గ్రామ పురవీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించారు.

తలమడుగు: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని కజ్జర్ల దేవాపూర్ బరంపూర్ తలమడుగు, సుంకిడి, కుచ్లాపూర్, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అయోధ్యలో 5000 సంవత్సరాల తర్వాత శ్రీరాముని అయోధ్య నిర్మాణం ఆలయంలో బలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టడంతో భక్తులు ఆలయాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, శోభాయమానంగా శ్రీరాముని విగ్రహంతో పలు వీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ హిందువుల కలలు కన్నా ఎద్దుల శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు రాముని స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. చిన్నారులలు వేసిన శ్రీరాముని వేషాధారణ ఎంతగానో ఆకట్టుకుంది. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, పద్మాకర్‌రెడ్డి, మంతెనశ్రీకాంత్, భజన మండలి భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో వీధివీధిన జైశ్రీరాం అంటూ చిన్నపెద్ద తారతమ్యం లేకుండా నినాదాలు చేస్తూ శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మండలంలోని పలు గ్రామాలతో పాటు మండల కేంద్రంలో ఘనంగా శోభాయాత్రలు నిర్వహించారు. ఈ శోభాయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొని రామనామ కీర్తనలతో వీధుల గుండా ర్యాలీ నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. పలు గ్రామాల్లో రామనామ స్మరణలతో ఆలయాలు మార్మోగాయి. మండలకేంద్రంలో వినూత్న రీతిలో శోభాయాత్ర నిర్వహించారు. పిల్లలకు రాముడి, సీత, లక్ష్మణుడు, హనుమతుడు వేషదారణలో శోభాయాత్రలో పాల్గొని అలరించారు.

భీంపూర్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠన సందర్భంగా భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి, నిపానీ, తాంసీ కే, భీంపూర్ ధనోరా, వాడుర్, అంతర్‌గాం, గోముత్రి, కరంజి (టి), ఆర్లి(టి) అందర్ బంద్, గుబ్ డి, తదితర గ్రామాలలో సోమావారం శ్రీరాముల వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అన్నదానాలు శోభ యాత్రలు జరిపారు.

తాంసి: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పొన్నారి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా సంకట యోచన హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో శ్రీరాముని విగ్రహన్ని ప్రతిష్ఠించి మేళ వాయిద్యాలు జై శ్రీరామ్, జై జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ మహిళల మంగళ హారతుల మధ్య శోభయాత్ర నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల గుండా నిర్వహించిన శోభాయాత్ర సాయంత్రం జిల్లా కేంద్రాల్లోని గోపాలకృష్ణ మఠానిక చేరుకుంది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బజార్‌హత్నూర్: మండలం పరిధిలోని అన్ని గ్రామాలు రామనామ స్మరణతో మార్మోగాయి. అయోజద్యా నగరంలో రామ్‌లల్లాను ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలం పరిధిలోని అన్ని దేవాలయాలలో రాత్రి నుంచి భజనలు, సంకీర్తనలతో భక్తులు పరవశించి పోయారు. ఉదయం యువకులు పెద్దఎత్తున కాశాయ జండాలను పట్టుకుని జైశ్రీరాం నామస్మరణతో బైక్‌లపై పెద్దఎత్తున ర్యాలీగ వెళ్లారు. అనంతరం మండల ప్రజలు శ్రీ రాముడు, సీత, లక్ష్మణుల రూపాలలో ఉన్న చిన్నారులను, వారి వెంట మండలవాసులు పాల్గొన్నారు.


ఉట్నూర్ రామాలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు


నేరడిగొండ మండలం బుగ్గారంలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు


తాంసి మండలం పొన్నారిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


తలమడుగులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఇంద్రవెల్లి శోభాయాత్రలో చిన్నారుల సందడి


పిప్పల్‌కోటిలో రాములోరి కల్యాణం దృశ్యం


బజార్‌హత్నూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు : కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి 22: ప్రజావాణి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగం కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. భూ సంబంధ, ఆసరా, రెండు పకడ గదుల ఇళ్లు, తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల విభాగంలో వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. శాఖల వారీగా వచ్చిన ప్రజాఫిర్యాదుల దరఖాస్తుల పై సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్జిదారులకు రాతపూర్వకంగా సమాధానం అందించాలని సూచించారు. అనంతరం జిల్లా షెడ్యుల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధుల అమలుపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు ప్రతీ సంవత్సరం 16శాతం ఎస్సీల సంక్షేమానికి నిధులు వినియోగించాలన్నారు. ఈ నెల 23న జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులు ఆయా శాఖల సంక్షిప్త నివేదికలతో ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలనిఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, ఎస్సీ సంక్షేమ అధికారిణి సునితకుమారి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


అర్జిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్